విద్యుత్ చార్జీల పెంపుపై నిర్వహించిన బహిరంగ విచారణలో మాట్లాడుతున్న శాసనమండలిలో బీఆర్‌ఎస్ పక్ష నేత మధుసూదనాచారి

చార్జీల భారం వద్దు

మొదటిపేజీ తరువాయి...

వ్యవహరించడం అత్యంత దారుణమని మధుసూదనాచారి మండిపడ్డారు. ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసేవిగా విద్యుత్తు సంస్థలను నడపాలని సూచించారు. ఫిక్స్‌డ్ చార్జీలను రూ.10 నుంచి రూ.50కి పెంచాలనుకోవడం దారుణమని అన్నారు. డిస్కంలు అదనపు ఆదాయం పెంచుకోవడమంటే, ప్రజలపై ఆదనపు భారం మోపడమేనని చెప్పారు. విద్యుత్తు చార్జీలు పెంచితే పారిశ్రామికరంగం కుదేలవుతుందన్నారు. పరిశ్రమలు మూతపడతాయని, ఇతర రాష్ర్టాలకు తరలివెళ్తాయని హెచ్చరించారు. రూ.1200 కోట్లకుపైగా ఆదాయం కోసం ఆర్రులుచాస్తున్నారని, ఇది రాష్ట్ర ప్రగతిని అడ్డుకోవడమే అవుతుందని అన్నారు. ఉదారంగా వ్యవహరించి రూ.1200 కోట్లను ప్రభుత్వమే సబ్సిడీ రూపంలో భరించాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రయోజనాల దృష్ట్యా ఈఆర్సీ ఈ పిటిషన్‌ను తిరస్కరించాలని కోరారు. కేసీఆర్ దూరదృష్టిలోతో తెలంగాణ విద్యుత్తు రంగంలో స్వర్ణమయం అయ్యిందని, స్థాపిత విద్యుత్తు సామర్థ్యం 7వేల మెగావాట్ల నుంచి 24 వేల మెగావాట్లకు పెరిగిందని గుర్తుచేశారు.

ఫిక్స్‌డ్ చార్జీలు అంతగా పెంచడం దేనికి: వేణుగోపాల్‌రావు

డిస్కంల ప్రతిపాదనలు వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని, ఫిక్స్‌డ్ ఛార్జీలు అమాంతం పెంచడం దేనికని సెంటర్ ఫర్ పవర్ స్టడీస్ కన్వీనర్ వేణుగోపాల్‌రావు ప్రశ్నించారు. ఇది డొంకతిరుగుడు వ్యవహారంలా ఉన్నదని, దీంట్లో హేతుబద్ధతలేదని మండిపడ్డారు. తక్కువ ఖర్చుతో జలవిద్యుత్తును ఉత్పత్తిచేసే అవకాశమున్నా, నిర్లక్ష్యమెందుకుని నిలదీశారు. డిస్కంలకు ప్రభుత్వం నుంచి ఆశించినంత సహకారం అందడంలేదని అన్నారు. ప్రభుత్వం రెవెన్యూలోటును తీర్చితే డిస్కంలు ఏఆర్‌ఏస్‌ను సమర్పించాల్సిన అవసరమే ఉండదని చెప్పారు.

పరిశ్రమలు రాజస్థాన్‌కు తరలివెళ్లాయి: ఇండస్ట్రీ ప్రతినిధులు

విద్యుత్తు చార్జీల భారం భరించలేకే పంజాబ్‌లోని అనేక పరిశ్రమలు రాజస్థాన్‌కు తరలివెళ్లాయని, రాష్ట్రంలోనూ ఇలాంటి పరిస్థితినే కోరుకుంటున్నారా? అని స్పిన్నింగ్ మిల్స్, సౌత్ ఇండియా సిమెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రశ్నించారు. విద్యుత్తు ఉద్యోగుల వేతనాలను 5 నుంచి 7శాతానికి పెంచి, భవిష్యత్తులో పెరిగే వాటిని ఇప్పటి నుంచి వసూలు చేసుకోవానుకోవడం పట్ల అభ్యంతరం వ్యక్తంచేశారు. సెక్యూరిటీ డిపాజిట్లపై వచ్చే వడ్డీని ఏఆర్ఆర్‌లో పేర్కొనలేదని చెప్పారు. విద్యుత్తు డిమాండ్ పెరుగుతుందని ఇష్టారీతిన పెట్టుబడులు పెట్టడం దారుణమని, ఎలాంటి అధ్యయనం లేకుండా ఏ ప్రాంతంలో లోడ్ పెరుగుతుందో స్పష్టంచేయకుండా గుడ్డిగా పెట్టుబడులు పెట్టి వినియోగదారులపై భారం మోపడం పట్ల అసంతృప్తి వ్యక్తంచేశారు.

విద్యుత్తు సంస్థలను ప్రైవేటీకరించొద్దు : దోనూరి రాము

రైతులకు ఉచిత కరెంట్ ఇస్తున్నామన్న నెపంతో విద్యుత్తు అధికారులు రైతుల పట్ల వివక్ష చూపుతున్నారని భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) ప్రతినిధి దోనూరి రాము ఆవేదన వ్యక్తంచేశారు. ఓఆర్సీ పేరుతో కొత్త కనెక్షన్లు ఇవ్వడంలేదని చెప్పారు. విద్యుత్తు సంస్థలను ప్రైవేటీకరించరాదని, ప్రైవేటీకరిస్తే రైతులు బతుకలేరని పేర్కొన్నారు. విద్యుత్తు సంస్థలు ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవాలని సూచించారు. కంపెనీల నుంచి సీఎస్సార్ నిధులు సమీకరించి, రైతులకు సేవచేయాలని అన్నారు. తద్వారా కంపెనీలు నష్టాలను పూడ్చుకోవచ్చని తెలిపారు.

నా నోటితో నేను చెప్పలేను

మొదటిపేజీ తరువాయి...

కోర్టులో చెప్పలేనని అన్నారు. బహిరంగంగా (ఓపెన్ కోర్టులో) అసభ్య పదజాలాన్ని చదవడం మంచిదికాదని, ఆమె చేసిన వ్యాఖ్యలను పిటిషన్‌లో పేర్కొన్నట్టు విన్నవించారు. సిరిసిల్ల నియోజకవర్గం నుంచి వరుసగా ఐదుసార్లు శాసనసభ్యుడిగా ఎన్నుకోబడి, ప్రజలకు సేవలందిస్తునట్టు తెలిపారు. తాను ఉన్నత విద్యావంతుడినని, అమెరికాలో, భారత్‌లో ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగం చేశానని చెప్పారు. 2006లో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున్న సాగుతున్న సమయంలో నెలకు రూ.4 లక్షల వేతనం సంపాదిస్తున్నప్పటికీ ఉద్యోగానికి రాజీనామాచేసి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నానని తెలిపారు.

రాష్ట్ర ప్రజల ప్రశంసలు పొందా..

తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీకి ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించానని, ఎమ్మెల్యేగా, మంత్రిగా రాష్ట్ర అభివృద్ధికి విశేష సేవలందించడంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తనకు అవార్డులు లభించాయని కేటీఆర్ తెలిపారు. 18 సంవత్సరాలపాటు ప్రజలతో మమేకమై మచ్చలేకుండా రాష్ట్ర ప్రజల ప్రశంసలు పొందానని చెప్పారు. తాను అందించిన సేవలకు గుర్తింపుగా మీడియా సంస్థలు సైతం 'యంగ్ పొలిటీషియన్' అవార్డుతో సత్కరించాయని వెల్లడించారు. వ్యక్తిగతంగా, రాజకీయంగా ప్రజల మధ్య తనకు మంచి పేరు, ప్రతిష్ఠలున్నాయని వివరించారు.

కావాలని నిరాధార ఆరోపణలు

మంత్రి కొండా సురేఖ మీడియా సమావేశంలో కావాలని తనపై నిరాధార ఆరోపణలు చేశారని కేటీఆర్ చెప్పారు. ఆ వ్యాఖ్యలు టీవీ చానళ్లు, సామాజిక మాధ్యమాలు, డిజిటల్ మీడియాలో ప్రసారం అయ్యాయని, ఆ వార్తా కథనాల ద్వారా సాక్షులుగా ఉన్నవారు తీవ్ర కలత చెందారని తెలిపారు. ఈ కేసులో సాక్షులుగా ఉన్నవారితో 18 సంవత్సరాలుగా తనకు పరిచయం ఉన్నదని, తన గురించి, గౌరవ మర్యాదల గురించి వారికి తెలుసు అని పేర్కొన్నారు. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యల వల్ల తన పరువుకు భంగం వాటిల్లిందని అన్నారు. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు ఏమిటి? వాటి గురించి వివరాలు చెప్పగలరా? అని జడ్జి ప్రశ్నించారు. మహిళల పట్ల తనకెంతో గౌరవం ఉన్నదని, కొండా సురేఖ సాటి మహిళ సమంతతోపాటు తనపై చేసిన అతినీచమైన, జుగుప్సాకరమైన వ్యాఖ్యలను పవిత్రమైన కోర్టులో తన నోటితో చెప్పలేనని అన్నారు. తన రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక ఉద్దేశపూర్వకంగా నిందలు వేశారని, ఈ దుశ్చర్యలను తీవ్రంగా పరిగణించి చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోర్టును కోరారు. టీవీల్లో, పత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో, డిజిటల్ మీడియాలో వచ్చిన వార్తాకథనాలకు సంబంధించిన క్లిప్పింగులను ఫిర్యాదు పత్రానికి జోడించినట్టు వివరించారు.

దాసోజు శ్రవణ్ వాంగ్మూలం

ఈ కేసులో సాక్షిగా ఉన్న దాసోజు శ్రవణ్‌కుమార్ స్టేట్‌మెంట్‌ను కోర్టు నమోదు చేసింది. 2007 నుంచి కేటీఆర్‌తోనే రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నానని శ్రవణ్ తెలిపారు. అక్టోబర్ 2న టీవీల్లో వచ్చిన వార్తలను చూసి బాధకు గురయ్యానని, మంత్రి కొండా సురేఖ కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలు అత్యంత జుగుప్సాకరంగా ఉన్నాయని తెలిపారు. అసభ్య పదజాలంతో చేసిన వ్యాఖ్యలు కేటీఆర్‌పై గౌరవాన్ని తగ్గించేలా ఉన్నాయని, టీవీల్లో వచ్చిన వార్తల గురించి తాను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. ఆమె మీడియాలో చేసిన ప్రసంగం బాధ పెట్టిందని పేర్కొన్నారు. తదుపరి విచారణను కోర్టు ఈ నెల 30కి వాయిదా వేసింది. మిగతా ముగ్గురు సాక్షుల వాంగ్మూలాలను కోర్టు ఆ రోజు నమోదు చేయనున్నది.

న్యాయం గెలుస్తది: దాసోజు

రాజకీయాల్లో దిగజారుడు మాటలు మాట్లాడవద్దని, కుటుంబాలను కించపరిచే వ్యాఖ్యలు చేయవద్దని బీఆర్‌ఎస్ నేత డాక్టర్ దాసోజు శ్రవణ్ సూచించారు. నాంపల్లి కోర్టు బయట ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సారీ చెప్తే చెలామణి అవుతుందని అనుకోవద్దని, న్యాయం, ధర్మం గెలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు. భవిష్యత్తులో రేవంత్‌రెడ్డి, కొండా సురేఖ, బండి సంజయ్ లాంటివారు ఏది పడితే అది మాట్లాడితే కుదరదని హెచ్చరించారు.

కోర్టు క్యాంటీన్‌లో చాయ్ బిస్కెట్

నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో వాంగ్మూలం ఇచ్చిన అనంతరం కేటీఆర్ అక్కడే కాసేపు ఉన్నారు. కోర్టు క్యాంటీన్‌లో ఉస్మానియా బిస్కెట్లు, ఇరానీ చాయ్ టేస్ట్ చేశారు. తిరిగి వచ్చే క్రమంలో బీఆర్‌ఎస్ మైనార్టీ నేతల ఆహ్వానం మేరకు నాంపల్లిలో పలు షాప్‌లకు వెళ్లి సందడి చేశారు. అభిమాన నేత తమ వద్దకు రావడంతో పలువురు సెల్ఫీలు తీసుకొని మురిసిపోయారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తదితరులు ఉన్నారు.

కోర్టు తీర్పు గుణపాఠం కావాలి: సత్యవతి

మహిళా మంత్రిగా ఉన్న కొండా సురేఖ వ్యాఖ్యలు మహిళల గౌరవాన్ని పెంచేలా ఉండాలి తప్ప భంగం కలిగించేలా ఉండకూడదని ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు. ఆమె హోదాకు, పదవికి, వయస్సుకు అలాంటి అసహ్యకరమైన వ్యాఖ్యలు తగవని హితవుపలికారు. కోర్టు తీర్పు ఇలా దారుణంగా మాట్లాడేవారికి గుణపాఠంగా ఉండాలని పేర్కొన్నారు. అప్పుడే ఎవ్వరైనా ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడతారని అన్నారు. నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టుకు కేటీఆర్ వెంటవచ్చిన మాజీమంత్రి అక్కడ మీడియాతో మాట్లాడారు. ఈ కేసులో తాను సాక్ష్యం చెప్పేందుకు వచ్చానని తెలిపారు. సమయాభావం వల్ల తన వాంగ్మూలం ఇవ్వలేకపోయానని 30వ తేదీన తనతోపాటు ముగ్గురు వాంగ్మూలం ఇస్తారని చెప్పారు.

30న ముగ్గురి వాంగ్మూలం

ఈ కేసులో నలుగురు సాక్షులుండగా సమయాభావం వల్ల కోర్టు ఒక్క దాసోజు శ్రవణ్ స్టేట్‌మెంట్‌ను మాత్రమే రికార్డు చేసిందని బీఆర్‌ఎస్ లీగల్ సెల్ సభ్యురాలు లలితారెడ్డి చెప్పారు. కోర్టు బయట ఆమె మీడియాతో మాట్లాడుతూ.. మిగతా ముగ్గురు సత్యవతి రాథోడ్, తుల ఉమ, బాల్క సుమన్ వాంగ్మూలాన్ని ఈ నెల 30న కోర్టు తీసుకుంటుందని చెప్పారు. వివిధ చానళ్లలో ప్రసారమైన కొండా సురేఖ వ్యాఖ్యలు సహా మొత్తం తొమ్మిది ఆధారాలను కోర్టుకు సమర్పించినట్టు తెలిపారు. ఇకపై కేటీఆర్‌పై ఎలాంటి వ్యతిరేక కామెంట్లు చేయవద్దని కోర్టు ఇన్‌జంక్షన్ ఆర్డరు ఇచ్చిందని తెలిపారు.

నాంపల్లి కోర్టుకు హాజరై వాంగ్మూలం సమర్పించి బయటకు వస్తున్న కేటీఆర్

ఈసీ మొట్టికాయలేసినా తీరు మారలే..

గతంలోనూ కేటీఆర్‌పై కొండా సురేఖ ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. అప్పుడు ఎన్నికల సంఘం ఆమె తీరుపై మండిపడింది. అయినప్పటికీ ఆమె మాటతీరులో ఎలాంటి మార్పు రాలేదు. మళ్లీ అవే ఆరోపణలు చేయటంతో బేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ ఆమెకు లీగల్ నోటీసులు పంపారు. మంత్రి నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో కొండా సురేఖపై పరువు నష్టం దావా కేసును కేటీఆర్ ఫైల్ చేశారు. ఈ నెల 21నే స్టేట్‌మెంట్ రికార్డ్ చేయాల్సి ఉన్నప్పటికీ కేటీఆర్ అభ్యర్థన మేరకు గురువారం వరకు కోర్టు సమయమిచ్చింది. బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు తెలంగాణభవన్ నుంచి కేటీఆర్‌సహా ఈ కేసులో సాక్షులుగా ఉన్న దాసోజు శ్రవణ్, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, బాల్కా సమన్, మాజీ మంత్రి జగదీశ్‌తోపాటు బీఆర్‌ఎస్ నేతలు నాంపల్లి కోర్టుకు బయలుదేరారు.

బండి సంజయ్‌కి కేటీఆర్ లీగల్ నోటీస్

- నిరాధార వ్యాఖ్యలతో పరువుకు భంగం
- వారంలో క్షమాపణ చెప్పాలి
- లేదంటే న్యాయపరంగా చర్యలు

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): కేంద్ర మంత్రి బండి సంజయ్ తనపై చేసిన నిరాధార వ్యాఖ్యల కారణంగా తన పరువుకు భంగం కలిగిందంటూ ఆయనకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు లీగల్ నోటీసులు పంపారు. వారం రోజుల్లోగా బేషరతుగా క్షమాపణలు చెప్పకపోతే పరువు నష్టం దావా వేస్తానని, క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ నెల 19న బండి సంజయ్ మీడియా సమావేశంలో తనపై తప్పుడు ఆరోపణలు చేశారని వివరించారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో తన తండ్రి కేసీఆర్ పేరును కూడా ప్రస్తావించారని, ఆయన వ్యాఖ్యలు తన వ్యక్తిత్వాన్ని అవమానపరిచేలా, ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నాయని పేర్కొన్నారు. తనను అప్రతిష్ఠపాలు చేయాలన్న దురుద్దేశంతోనే బండి సంజయ్ ఇలాంటి వ్యాఖ్యలు చేశారని, వాటిని నిరూపించాలని సవాల్ చేశారు. బండి సంజయ్ వ్యాఖ్యలు విస్తృతంగా మీడియా, సోషల్ మీడియా ద్వారా ప్రచారం అయ్యాయని ఈ నేపథ్యంలో ప్రజలు తనను తప్పుగా అర్థం చేసుకొని ప్రమాదం ఉన్నదని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ సహా డ్రగ్స్ ఆరోపణలు ఉద్దేశపూర్వకంగా కల్పించిన కట్టుకథలుగా కేటీఆర్ కొట్టిపారేశారు.

బురద చల్లడమే బండి ఉద్దేశం

కేంద్రమంత్రి పదవిలో ఉన్న బండి సంజయ్ లాంటి వ్యక్తి చేసే ఆరోపణలు ప్రజాబాహుళ్యంలోకి విస్తృతంగా ప్రచారం అవుతాయని కేటీఆర్ పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తనపై బురద చల్లాలనే దురుద్దేశంతో ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, తొమ్మిదేండ్లు రాష్ట్ర మంత్రిగా రాష్ట్ర ప్రయోజనాల కోసం కృషి చేసిన తనను బద్నాం చేయడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. గతంలోనూ బండి తనపై ఇలాంటి వ్యాఖ్యలే చేశారని, రాజకీయంగా తనను ఎదుర్కొనే శక్తిలేక వ్యక్తిత్వంపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తన ప్రతిష్ఠను దెబ్బతీయాలనే కుట్ర తప్పవారి ఆరోపణల్లో నిజం లేదని స్పష్టంచేశారు.

బీఆర్‌ఎస్‌కు జరిమానా విధింపు రద్దు

- నల్లగొండ బీఆర్‌ఎస్ కార్యాలయం కేసులో సింగిల్ జడ్జి ఆదేశాలపై ద్విసభ్య ధర్మాసనం తుది ఉత్తర్వులు

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): నల్లగొండ జిల్లా బీఆర్‌ఎస్ కార్యాలయ భవన నిర్మాణ వ్యవహారంపై ఆ పార్టీ నేత రెండుసార్లు పిటిషన్లు దాఖలు చేయడంతో ఆగ్రహానికి గురైన సింగిల్ జడ్జి గతంలో విధించిన రూ.లక్ష జరిమానాను హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం రద్దు చేసింది. సెప్టెంబర్ 18న సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవరిస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాథే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం బుధవారం తుది ఉత్తర్వులు జారీ చేసింది. ఆ భవనాన్ని క్రమబద్ధీకరించాలని ఆ పార్టీ ఆన్‌లైన్‌లో గత జూలై 3న నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌కు దరఖాస్తు చేసుకున్నది. దానిని తిరస్కరిస్తూ కమిషనర్ జూలై 20న ఉత్తర్వులు జారీ చేశారు. నిర్మాణాన్ని 15 రోజుల్లో తొలగించాలని, లేకపోతే కూల్చివేస్తామంటూ కమిషనర్ నోటీసులు జారీ చేశారు. దీనిపై బీఆర్‌ఎస్ తరఫున మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ దాఖలు చేసిన పిటిషన్‌ను సింగిల్ జడ్జి తోసిపుచ్చారు. నల్లగొండ సర్వేనంబర్ 1506 లోని ఎకరం స్థలంలోని నిర్మాణాన్ని క్రమబద్ధీకరించేలా కార్పొరేషన్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసేందుకు నిరాకరించారు. వాస్తవానికి ఈ వివాదాన్ని మున్సిపల్ బిల్డింగ్ ట్రిబ్యునల్ విచారణ చేయాలని, ఆ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసేలా ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇవ్వాలని, అప్పటివరకు కమిషనర్ ఆదేశాలను రద్దు చేయాలంటూ రవీంద్రకుమార్ రెండోసారి పిటిషన్ దాఖలు చేశారు. ఒకే వ్యవహారంపై రెండోసారి పిటిషన్ ఎలా దాఖలు చేస్తారంటూ సింగిల్ జడ్జి పిటిషనర్‌కు లక్ష జరిమానా విధించారు. ఈ మొత్తాన్ని నాలుగు వారాల్లో నల్లగొండ లీగల్ సర్వీసెస్ అథారిటీకి చెల్లించాలని తీర్పు వెలువరించారు. దీనిని సవాలు చేస్తూ పిటిషనర్ దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ పూర్తి చేసింది. మున్సిపల్ చట్టం-2019 ప్రకారం అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించే అధికారం మున్సిపల్ కార్పొరేషన్‌కు లేదని, పిటిషనర్ కార్యాలయ భవన నిర్మాణాన్ని క్రమబద్ధీకరణ కోరేందుకు చట్టంలోనే వెసులుబాటు లేదని తేల్చింది. రూ.లక్ష జరిమానా విధింపు ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్టు తీర్పులో పేర్కొన్నది.

వన్ పోలీస్ విధానం ఏమైంది రేవంత్?

- కేసీఆర్ హయాంలో స్పెషల్ కానిస్టేబుళ్లకు 15 రోజులు డ్యూటీ చేస్తే 4 రోజులు సెలవులు
- ఇప్పుడు వరుసగా 26 రోజులు డ్యూటీ చేస్తేనే నాలుగు రోజులు లీవ్ ఇస్తామని అంటున్నారు
- మరమనుషుల్లా చూస్తున్నరు
- భార్యలు రోడ్డెక్కితే కానిస్టేబుళ్లపై వేటు వేయడమేంటి?
- సీఎంపై బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్పీ ఫైర్

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో గొప్పగా చెప్పిన 'ఏక్ పోలీస్' విధానం ఏమైందని బీఆర్‌ఎస్ నేత డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ నిలదీశారు. బీఆర్‌ఎస్ హయాంలో స్పెషల్ కానిస్టేబుళ్లకు 15 రోజులు డ్యూటీ చేస్తే 4 రోజులు సెలవులు ఉండేవని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక 26 రోజులు వరుసగా డ్యూటీ చేస్తేనే 4 రోజులు లీవ్ ఇస్తామంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో సీఎం కేసీఆర్ స్పెషల్ కానిస్టేబుళ్లను మనుషులుగా చూస్తే.. ఇప్పుడు రేవంత్ మరమనుషులుగా చూస్తున్నారని ఫైరయ్యారు. పోలీస్ అమరవీరుల స్మారక దినోత్సవంలో రేవంత్ పాల్గొన్న రోజే పోలీసు కానిస్టేబుళ్ల కుటుంబాలు రోడ్డెక్కాల్సిన పరిస్థితి దాపురించిందని, కానిస్టేబుళ్ల భార్యలు రోడ్డెక్కితే నల్లగొండలో కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయడం ఏమిటని ధ్వజమెత్తారు. ఆ సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 11 నెలలుగా హోంమంత్రి లేడని, ఈ శాఖను తనవద్దే పెట్టుకున్న సీఎం రేవంత్ సరిగా పర్యవేక్షించలేకపోతున్నారని, ఆయన పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని విమర్శించారు. సమాజంతోపాటు ప్రజాప్రతినిధులకు, మంత్రులకు భద్రత కల్పిస్తున్న పోలీసులకు ప్రభుత్వం ఇచ్చిన ఆరోగ్య భద్రత కార్డులు హాస్పిటల్స్‌లో పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

శాంతిభద్రతలపై ఒక్క రివ్యూ అయినా చేశారా?

రాష్ట్రంలో రోజురోజుకు శాంతిభద్రతలు దిగజారిపోతున్నాయని, హైదరాబాద్‌లో పట్టపగలే హత్యలు జరుగుతున్నా ప్రభుత్వం నియంత్రించలేపోతున్నదని ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు. అంబర్‌పేటలో రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ లింగారెడ్డి దంపతులు దారుణ హత్యకు గురై 7 రోజులైనా ఇప్పటివరకు ఒక్క నిందితుడిని కూడా ఎందుకు అరెస్టు చేయలేకపోయారని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ హయాంలో 10 లక్షల పైచిలుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు గుర్తుచేశారు. వాటిపై ఇప్పుడు పర్యవేక్షణ లేక దాదాపు సగం కెమెరాలు పనిచేయడం లేదని, అయినా రేవంత్ సర్కార్ పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు బీఆర్‌ఎస్ సోషల్ మీడియా నిర్వాహకులపై ఎన్ని కేసులు పెట్టారన్న అంశంపై తప్ప శాంతిభద్రతలపై రేవంత్ ఒక్క రివ్యూ అయినా చేశారా అని నిలదీశారు. పోలీసులను అడ్డంపెట్టుకొని బీఆర్‌ఎస్ నేతలపై కేసులు నమోదు చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. పోలీస్ అమరవీరుల దినోత్సవం రోజు తనకు డీజీపీ ఆహ్వానం పంపారని, ఆ రోజు తాను బయటకు వెళ్తానంటే పోలీసులు హౌస్ అరెస్టు చేశారని మండిపడ్డారు. పోలీస్ శాఖలో అశాంతి నెలకొన్నదని, ప్రజల్లో అభద్రతాభావం పెరిగిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

మైనంపల్లిపై కేసు ఎందుకు నమోదు చేయలేదు?

బీఆర్‌ఎస్ నేతలపై అకారణంగా కేసులు నమోదు చేస్తున్న పోలీసులు.. కేటీఆర్, హరీశ్‌రావుపై పెట్రోల్ పోసి చంపుతానని గజ్వేల్‌లో బహిరంగంగా బెదిరించిన మైనంపల్లి హన్మంతరావుపై కేసు ఎందుకు నమోదు చేయలేదని ప్రవీణ్‌కుమార్ నిలదీశారు. కొల్లాపూర్‌లో శ్రీధర్‌రెడ్డి హత్య జరిగి 7 నెలలైనా నిందితులను అరెస్టు చేయలేదని, ఈ హత్యలో మంత్రి జూపల్లి కృష్ణారావు హస్తం ఉన్నదని మృతుడి తండ్రి డీజీపీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ కేసులో ఎస్పీని బదిలీ చేసి చేతులు దులుపుకున్నారని అన్నారు. శ్రీధర్‌రెడ్డి హత్యలో మంత్రి జూపల్లి పాత్రపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు గజ్జెల నగేశ్, ఫయాజ్, కొంకటి శేఖర్ పాల్గొన్నారు.

ఒకే పోలీస్ విధానం ఉండాలి

5వ బెటాలియన్ పోలీస్ కుటుంబాల డిమాండ్

గోవిందరావుపేట, అక్టోబర్ 23: రాష్ట్రవ్యాప్తంగా ఒకే పోలీస్ విధానం ఉండాలని ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయి సమీపంలోని లక్నవరం క్రాస్ వద్ద ఉన్న 5వ పోలీస్ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మధ్యాహ్నం ప్లకార్డులను పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో సుమారు అరగంటపాటు జాతీయ రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా పోలీసుల కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం శాంతి భద్రతలు కాపాడే పోలీస్ వ్యవస్థలో ఏక్ పోలీస్ విధానాన్ని అనుసరించడం లేదని చెప్పారు. రాష్ట్రంలో శాంతి భద్రతల కోసం రిజర్వ్ పోలీస్ ఫోర్స్ కానిస్టేబుళ్లు వెట్టిచాకిరీ చేస్తున్నా.. వారి కుటుంబాల ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. విధి నిర్వహణ పేరుతో ప్రభుత్వం వారిని కుటుంబాలకు దూరం చేస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. విషయం తెలుసుకున్న పస్రా సీఐ రవీందర్ ఘటనా స్థలానికి చేరుకొని రాస్తారోకోను విరమింపజేశారు.

ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయి సమీపంలో లక్నవరం క్రాస్ వద్ద ధర్నా చేస్తున్న కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు

పోలీస్ సిబ్బందిపై ఆరా

కరీమాబాద్, అక్టోబర్ 23: రాష్ట్రవ్యాప్తంగా ఒకే పోలీసింగ్ విధానం అమలు చేయాలని కోరుతూ రోడ్డుపై నిరసన తెలిపిన కానిస్టేబుల్ కుటుంబ సభ్యులపై పోలీస్ అధికారులు ఆరా తీస్తున్నట్టు తెలుస్తున్నది. వరంగల్ జిల్లాలోని మామునూరు 4వ బెటాలియన్ కానిస్టేబుళ్ల భార్యాపిల్లలు ఇటీవల ఆర్టీవో జంక్షన్‌లో నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టినట్టు సమాచారం. ఈ మేరకు పలు ఫొటోలు, వీడియోల ఆధారంగా విచారణ చేస్తున్నట్టు తెలుస్తున్నది. బెటాలియన్‌లో ఉన్న కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు ఎవరున్నారో తెలుసుకునే పనిలో ఉన్నట్టు సమాచారం. కుటుంబ సభ్యుల ఆందోళనలతో కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకున్నట్టు పలు సామాజిక మాధ్యమాల్లో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ విషయమై అధికారులను వివరణ కోరగా.. అలాంటిదేమీ లేదని చెప్పినట్టు సమాచారం.

కులగణన కోసం 26న చలో ఢిల్లీ

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, అక్టోబర్23 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని, దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టనున్నట్టు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఆర్ కృష్ణయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యాంగపరమైన హక్కులను కల్పించకుండా కేంద్రంలోని ప్రభుత్వాలు 76 ఏండ్లుగా బీసీలను అన్యాయానికి గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. కులగణన కోసం ఇప్పటికే అనేకసార్లు ఆందోళనలు నిర్వహించామని, అయినా కేంద్రం నుంచి సానుకూల స్పందన రావడం లేదని మండిపడ్డారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీ బిల్లును ప్రవేశపెట్టాలని, దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని, చలో ఢిల్లీ కార్యక్రమంలో ప్రతీ బీసీ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

కందుకూరులో కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న సబితా ఇంద్రారెడ్డి

నిరుపేదలకు శాపంలా కాంగ్రెస్

- అన్ని వర్గాలకు సర్కార్ మోసం
- ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలి
- ఫార్మా భూములు రైతులకివ్వాలి
- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు, అక్టోబర్ 23 : కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల పాలిట శాపంగా మారిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. ఇచ్చిన మాటలకు ప్రభుత్వం కట్టుబడి ఉండాలని సూచించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కందుకూరు మండల పరిషత్ కార్యాలయం సమావేశ హాలులో బుధవారం నిర్వహించిన కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణ లక్ష్మి పథకానికి అదనంగా తులం బంగారం కలిపి ఇస్తామని ఇచ్చిన మాటను కాంగ్రెస్ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎవరు ఔనన్నా.. కాదన్నా కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టింది కేసీఆరేనని, ఆడబిడ్డలకు పెండ్లిళ్లకు పెద్దగా నిలిచింది ఆయనేనని స్పష్టంచేశారు. మహిళలకు ఇస్తానన్న రూ.2,500, డబుల్ చేసి ఇస్తామన్న పింఛన్ల హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. పదేండ్ల పాటు కేసీఆర్ పాలన ప్రణాళికాబద్ధంగా సాగిందని, 10 నెలలు దాటినా కాంగ్రెస్ సర్కార్ ఏ ఒక్కటీ సరిగ్గా అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి గొప్పలు చెప్పుకొంటున్నదని విమర్శించారు.

భూములు తిరిగివ్వాలి

ఎన్నికలప్పుడు భట్టి విక్రమార్క, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తమ పార్టీ అధికారంలోకి వస్తే ఫార్మాసిటీకి కేటాయించిన భూములను తిరిగి రైతులకు ఇస్తామని చెప్పారని, వారు ఇచ్చిన మాట ప్రకారం రైతులకు భూములను తిరిగివ్వాలని సబిత డిమాండ్ చేశారు. రైతుబంధుకు ఎగనామం పెట్టి, కౌలు రైతులను అసలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలో మంజూరైన రహదారుల పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. విశాలమైన రోడ్డు ఉన్నా రైతుల భూములను లాక్కొని ఫోర్త్ సిటీలో రోడ్డు వేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉన్నదని ఎద్దేవాచేశారు.

ఆటో డ్రైవర్లు చస్తుంటే.. విదేశీ టూర్లలో మంత్రులా?

- మా ఉపాధిని దెబ్బతీసి ఏం సాధించారు?
- నవంబర్ 5న ఇందిరాపార్క్‌లో మహాధర్నా
- ఈ సర్కార్‌కు బుద్ధి చెప్పాలి: వేముల మారయ్య



హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ)/హిమాయత్‌నగర్: రాష్ట్రంలో ఆటో డ్రైవర్ల బతుకులు నాశనమవుతుంటే, రాష్ట్ర మంత్రులు మాత్రం విదేశీ టూర్ల పేరిట కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని బీఆర్‌టీయూ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య ధ్వజమెత్తారు. హదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. ఆటో డ్రైవర్ల సమస్యలు తీర్చాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 5న హైదరాబాద్ ఇందిరా పార్కులో మహా ధర్నా నిర్వహించనున్నట్టు ప్రకటించారు. ఆటో డ్రైవర్ల సమస్యలపై రవాణా శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పుడు ఆ మంత్రి మాత్రం విదేశీ టూర్లలో ఉన్నారని ఎద్దేవా చేశారు. ఉచిత బస్సు ప్రవేశపెట్టిన కాంగ్రెస్ సర్కార్ డ్రైవర్ల ఉపాధిని దెబ్బతీసిందని విమర్శించారు. రాష్ట్రంలో ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకుంటుంటే రేవంత్ సర్కార్ చోద్యం చూస్తున్నదని ధ్వజమెత్తారు. మహాధర్నాకు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఆటో డ్రైవర్ల సత్తాను చాటాలని ఏఐటీయూసీ నేత వెంకటేశం పిలుపునిచ్చారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ ప్రవీణ్, డీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.